ప్రజాశక్తి
శుక్రవారం 14 ఏప్రిల్ 2023 8 పేజీలు


తిరుపతి

చిత్తూరు

మోడీని గద్దె దింపుదాం..!

నేటి నుంచి వామపక్షాల 'ప్రచార భేరి'

- ఈనెల 30 వరకు సభలు, సదస్సులు - 23న శ్రీకాళహస్తికి 'అతిరథుల' రాక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అబద్ధపు మాటలు చెప్పి గద్దెనెక్కిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపకపోతే ఉద్యోగ కార్మికులు, సామాన్యులు బతికి బట్టకట్టే పరిస్థితి లేదు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని సంరక్షించుకోవాలంటే వినాశకర కాషాయ పార్టీ పోవాలని వామపక్షాలు ప్రచారభేరిని ప్రారంభించబోతున్నాయి.

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహం వద్దనుంచే సిపిఎం, సిపిఐలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారభేరి మోగించనున్నాయి. విభజన హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, మండుతున్న ధరలను తగ్గించాలని తదితర ప్రధాన డిమాండ్లతో ప్రజల వద్దకు నేతలు వెళ్లనున్నారు. ఈనెల 14 నుంచి 30వ తేదీ వరకు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పెద్దఎత్తున బహిరంగసభలు, సదస్సులు జరగనున్నాయి. ఈనెల 23న శ్రీకాళహస్తిలో జరిగే భారీ బహిరంగసభకు సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరుకానున్నారు. తొలిరోజు ప్రారంభమయ్యే ప్రచార భేరిని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు హరినాథరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ప్రారంభించనున్నారు. చిత్తూరు జిల్లాలో జరిగే సదస్సులకు సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వాడా గంగరాజు, నాగరాజు నాయకత్వం వహించనున్నారు.

దేశాన్ని నిర్వీర్యం చేశారు

వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

మోడీకి ఛాన్స్ ఇస్తే దేశాన్ని సర్వనాశనం చేశారు. ఆదానీ, అంబానీలకు ఆస్తులు కూడగట్టడమే ప్రధాన కర్తవ్యమయ్యింది. పెరుగుతున్న నిరుద్యోగాన్ని పట్టించుకోలేదు. ఆకాశాన్ని అంటుతున్న నిత్యవసర ధరలను అదుపు చేయడంలో విఫలమయ్యారు. రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కాషాయమూకలు కుట్ర పన్నుతున్నాయి. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న రాష్ట్రంలోని మూడు పార్టీలు మోడీకి భజన చేయడం ప్రజలందరికీ తెలుసు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీలేదు. కడప ఉక్కువ మాటేంటన్నది చెప్పరు. మన్నవరం ఊసేలేదు. తిరుపతి విమానాశ్రయాన్ని అప్పన్నంగా అమ్మేయడానికి పూనుకుంటున్నారు.

ధరల మీద ధరలు

పి.మురళి, సిపిఐ జిల్లా కార్యదర్శి

మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్రోల్ డీజిల్ ధరలకు అదుపులేకుండా పోయింది. పర్యవసానంగా నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఏడుసార్లు కరెంట్ ఛార్జీలను పెంచింది. నాలుగుసార్లు బస్సు ఛార్జీలను పెంచింది. సామాన్యుడు మూడు పూటలా తినే పరిస్థితి లేకుండా పోయింది. ఏటా లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ మాట మార్చాడు. మతతత్వ అజెండాను అమలు చేస్తూ రాజ్యాంగ వ్యవస్థను మంటగలుపుతున్నారు. కారుచౌకగా లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ఒక్కొక్కటి అమ్మేస్తున్నారు. నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నారు. మోడీ, జగన్ చేస్తున్న కుట్రలను ప్రజల్లోకి, కార్మికుల్లోకి తీసుకెళ్లేందుకు ఈ ప్రచార భేరి ముఖ్య ఉద్దేశ్యం.

వినాశకర విధానాలపై ఉమ్మడి పోరు

వాడ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద వినాశనంపై వామపక్షలు ఉమ్మడి పోరుకు పిలుపునిచ్చాయి. జిల్లా వ్యాప్తంగా ఈనెల 14వ తేది నుండీ 30వ తేది వరకు ప్రచార రణభేరి సభలు, సమావేశాలు, పాదయాత్రలు ఉమ్మడి వామపక్షాల నేతృత్వంలో నిర్వహిస్తున్నాం. అభ్యుదయ వాదులు, కార్మికులు, కర్షకులు అన్ని వర్గాలు ప్రజలు ప్రచార రణ భేరి కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నాం. రాజ్యాంగ విలువలు అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనపై ఉంది.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి

కేంద్రంలో మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ రచించిన రాజ్యాగం ప్రమాదంలో పడింది. మతోన్మాద విధానాలతో మతాల మధ్య చిచ్చురేపుతోంది. కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలు అప్పగించే ప్రయత్నం చేస్తోంది. వ్యవసాయ విధానాల్లో మార్పులు చేస్తోంది. మోడి పాలనలో అన్ని వర్గాలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది.

కరెంట్ బిల్లు కట్టకపోవడంతో..

నెలరోజులుగా సచివాలయంలో 'చీకటి'

ప్రజాశక్తి - పెళ్లకూరు: సచివాలయాల ఆర్థిక పరిస్థితి ఎలా ఉందంటే కరెంట్ బిల్లు కట్టుకోలేని దయనీయ స్థితిలో ఉన్నాయి. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని కానూరు రాజుపాలెం గ్రామ పంచాయతీలోని సచివాలయంలో నెలరోజులుగా కరెంట్ లేదు. కరెంట్ బిల్లులు కట్టకపోవడంతో సరఫరాను నిలిపేశారు. దీంతో నెలరోజులుగా ప్రజల అవస్థలు వర్ణనాతీతం. సర్టిఫికేట్ల కోసం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తూ సచివాలయ సిబ్బందిని 2 లో

(తరువాయి భాగం)

కరెంట్ బిల్లు కట్టకపోవడంతో..

నెలరోజులుగా సచివాలయంలో 'చీకటి'

నిలదీస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని సచివాలయానికి కరెంట్ సౌకర్యం పునరుద్ధరించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రూప్‌సాగర్‌ను వివరణ కోరగా నెలరోజులుగా కరెంట్ లేనిది వాస్తవమని, పంచాయతీలో ఎలాంటి నిధులూ లేవని, 15వ ఫైనాన్స్ నిధులు వచ్చిన తరువాత బిల్లులు కడతామని సంబంధిత ఎఇకి తెలిపినా నిర్లక్ష్యంగా కరెంట్ సరఫరా నిలిపేశారని, ఏం చేయాలో తెలియడం లేదని వాపోయారు.

వృద్ధులకు చేయూతనివ్వడం ముఖ్యం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: స్థానిక భవాని నగర్ నందలి ఆదరణ వద్ధాశ్రమానికి లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ ఆధ్వర్యంలో పేద వద్దులకు నెల రోజులు సరిపడ మారి బిస్కెట్ ప్యాకెట్లును లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ వితరణ చేసారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అనాధ వద్దులను చేరదీసి వారి ఆలనాపాలనా చూస్తున్న ఆదరణ ఆశ్రమ నిర్వాహకురాలు వసంతమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి జగన్నాధం, సభ్యులు బెల్లంకొండ సురేష్, లక్ష్మి, రామారావు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

కలకలం రేపిన జంట హత్య

ప్రజాశక్తి- చౌడేపల్లి:

ఎస్సీ వర్గానికి చెందిన భార్యభర్తలను హత్యచేసి ఆపై మూటకట్టి రాళ్లు పెట్టి వ్యవసాయబావిలో పడేసిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలంలోని పందిళ్లపల్లి పంచాయతీ చుక్కావారిపల్లి సమీపంలోని ఓ మామిడి తోటలో కాపురం ఉండే పాపన్న కుమారుడు ముని (25), వీరమ్మ (20) దంపతులు. వీరు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించడంతోపాటు మామిడి తోటలకు కాపలాగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 7వ తేదీన వీరమ్మ సోదరి సిద్దమ్మ కొత్తఇండ్ల వద్ద మామిడి తోటకు కాపలా ఉండగా అక్కడికి వారిద్దరూ వచ్చి మరుసటి రోజు 8వ తేదీ సొంత గ్రామానికి చేరుకున్నారు. అయితే ఆరోజు నుంచి గత ఎనిమిది రోజులుగా భార్యభర్తలు కనిపించకపోవడంతో మండలంలోని శక్తిపేట పంచాయతీ, ఎర్రగానిపల్లి సీపంలోని బుడమలకుంట వద్దగల ఓ రైతు వ్యవసాయబావిలో దారుణంగా హత్యచేసి మూతకట్టి ఉన్న శవాలు తేలుతూ కనిపించాయి. సమాచారం అందుకున్న పుంగనూరు రూరల్ సిఐ మధుసూదన్ రెడ్డి, ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాలను వెలికి తీయించారు. అయితే అప్పటికే మృతదేహాలు చితికిపోయి ఉండటంతో మృతుడి జేబులో ఉన్న సెల్‌ఫోన్ నుంచి సిమ్‌కార్డు ఆధారంగా వారిద్దరూ ముని, వీరమ్మలుగా గుర్తించారు. మృతురాలు వీరమ్మ సోదరి సిద్దమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై మృతదేహాలకు అక్కడే పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. కాగా ఎర్రగానిపల్లి పరిసర ప్రాంతాల్లో అడవి జంతువులకు విద్యుత్ వైర్లు అమర్చడంతో యానాది దంపతులిద్దరూ విద్యుదాఘాతానికి గురౌ మరణించారని దాన్ని కప్పిపుచ్చుకునేందుకే ఈ దురాగతానికి పాల్పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిధుల లేమితో..నీరసించిన ఎస్సీ కార్పొరేషన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

గత ప్రభుత్వం సబ్సిడీ రుణాలు, బ్యాంకు సబ్సిడీలు, యువత ఉపాధి అంటూ బిజీబిజీగా ప్రతిరోజూ ప్రభుత్వ పథకాల కోసం ఆరా తీసే యువత, దరఖాస్తులు చేసే వారితో ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం నేడు బోసిపోయి కనిపిస్తోంది.. స్టేషనరీ ఖర్చులు కూడా లేకపోవడంతో ఈ కార్పొరేషన్‌లో పనిచేసే సిబ్బంది దయనీయ పరిస్థితిలో అల్లాడుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

నాటి పథకాలెన్నో..

గత ప్రభుత్వం షెడ్యూల్ కులాల సేవాసహకారం సంఘం (ఎస్సీ కార్పొరేషన్) ఎస్సీల కోసం అనేక పథకాలను అమలు చేసింది. లక్ష నుంచి కోటి రూపాయల వరకు బ్యాంకు సబ్సిడీలతో రుణాలు పొందే అవకాశం కల్పించింది. ఒక దశలో ఇనోవా కార్లు ఎస్సీ యువతకు సబ్సిడీల రూపంలో అందించారు. పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే యువతకు సబ్సిడీ రుణాలు బ్యాంకు ద్వారా అందించారు. అల్పాదాయ వర్గాలకు చెందిన వారు చిన్న వ్యాపారం, కుటీర పరిశ్రమలు, చర్మవృత్తిదార్లు, సఫాయి కర్మచారులు, పాడి ఆవులు, గెదెలు, గొర్రెలపెంపకం, భూమి కొనుగోలు, బోర్ బావులు, విద్యుత్ మోటార్లు, పైపులైన్లు, సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ వంటి పథకాలు అమలు చేసింది. ఇలా అనేక పథకాలు షెడ్యూల్ కులాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలతో సబ్సిడీ రుణాలు అందించింది. వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక... ఎస్సీ కార్పొరేషన్ పరిస్థితి ఆదోగతిగా మారిపోయింది.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పథకమంటే ఒక్క పథకం కూడా నేరుగా షెడ్యూల్ కులాల అభివృద్ధి కోసం అమలు కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రెండు స్కీమ్‌లు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువత దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రకటించింది. ఈ పథకాలు కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ అభ్యర్ధుల ఎంపిక పూర్తిగా ఆన్లైన్ ద్వారానే. ఇందులో ఎస్సీ కార్పొరేషన్ పేక్షకపాత్రే... ఎన్ఎస్ఎఫ్‌డిసి (యంగ్ ఎంటర్ ఫైనాన్స్ జనరేషన్ స్కీమ్) అమృతధార షెడ్యూల్డు కులాలకు చెందిన వారు వ్యవసాయ బోరు, మోటర్లు ఏర్పాటు చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో బోరు మోటరు, జేసిబి, భారీ యంత్రాలు కొనుగోలు చేసేందుకు బ్యాంకుల నుండి రుణాలు పొందినా ప్రభుత్వం నుండి ఏ పథకానికైనా వచ్చే సబ్సిడీ రూ.60వేలు మాత్రమే దాదాపు నాలుగు సంవత్సరాల తరువాత ఎస్సీ కార్పొరేషన్ నుండి రుణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలంటూ ప్రకటన విడుదల కావడంతో చిత్తూరు జిల్లాలో 400మంది యువకులు రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

బడ్జెట్‌లో నిధుల కేటాయించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు బడ్జెట్ విడుదల చేస్తుందనే ఆశతో ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది ఎదురు చూస్తున్నారు. కనీసం స్టేషనరీ ఖర్చులు కూడా ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. ఎలాంటి పథకాలు అమలు చేయకపోవడంతో ఎస్సీ కార్పొరేషన్ నిర్వీయం అయ్యే పరిస్థితికి వచ్చిందంటున్నారు. జగన్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు బడ్జెట్ మంజూరు చేయాలని దళిత సంఘాలనేతలు కోరుతున్నారు. నవరత్నాలతో పాటు బడ్జెట్‌లో నిధులు కేటాయించక నిర్వీయమౌతున్న కార్పొరేషన్‌లను పట్టించుకోవాలని అంటున్నారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నా యువతకు ఉపాధి కల్పించేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉందని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరసింహులు తెలియజేశారు. ప్రభుత్వం బడ్జెట్ నిధులు విడుదల చేయకపోవడంతో సిబ్బంది జీతాలు కూడా కష్టంగా మారిందని అన్నారు. జిల్లాలోని అనేక మంది షెడ్యూల్ కులాలకు చెందిన యువకులు సబ్సిడీ రుణాల కోసం ఎస్సీ కార్పొరేషన్‌ను ఆశ్రయిస్తున్నా సమాధానం చెప్పలేకపోతున్నామని అంటున్నారు.

భూసార పరీక్షలపై శిక్షణ

ప్రజాశక్తి- పెద్దపంజాణి: రైతులు వేసే పంటలకు ముందు భూమి ఆరోగ్య భూసార పరీక్షలు తప్పనిసరి చేసుకుంటే అధిక దిగుబడిలో వస్తాయని సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ అన్నారు. గురువారం రాజుపల్లి రైతు భరోసా కేంద్ర పరిధిలో భూమి ఆరోగ్య భూసార పరీక్షచేసే విధానంపై రైతు భరోసా కేంద్రం సిబ్బందికి, రైతులకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సహాయ వ్యవసాయ సంచాలకులు శివ కుమార్ మాట్లాడుతూ చెట్లు నీడలోన, ఎరువులు వేసిన దగ్గర, పంటలు ఉండే దగ్గర, గట్ల వెంబడి కాలిబాటల వెంబడి మట్టి సేకరణ చేయకూడదన్నారు. ఏటువంటి పంటలు లేకుండా ఖాళీగా ఉండేటటువంటి పొలాలలో పైన ఉన్నటువంటి చెత్తాచెదారాన్ని తొలగించి 'వి' ఆకారంలో చేసి అరకేజీ మట్టి నమూనా సేకరించాలని అందుకు ఏప్రిల్, మే, నెలలు చాలా అనువైనవని అన్నారు. రైతులు వర్షాల ఆధారంగా పండే పొలాలలో మూడు సంవత్సరాల ఒకసారి, అదేవిధంగా నీటి ఆధారిత పంటలను పండించే భూములలో మూడు సీజన్లకు ఒకసారి 2.5 ఎకరాలలో 8-10 చోట్ల మట్టిని తవ్వి తీసి సేకరించిన మట్టిని కూడా క్వాడ్రెట్ మెథడ్‌లో నాలుగు భాగాలుగా చేసి దానిని అరకేజీ మట్టిని పరీక్షా కేంద్రానికి పంపించాలని స్థానిక అధికారులకు సూచించారు. భూసార పరీక్ష పత్రం అనుగుణంగా రైతులు ఎరువులను వాడినట్లయితే పెట్టుబడిన తగ్గించుకొని, నాణ్యమైన పంటను, అధిక దిగబడిన పొందవచ్చునని పర్యావరణాన్ని కూడా కాపాడు కోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తమ్మిరెడ్డి, శంకర్ రెడ్డి, ఎంపీటీసీ కష్ణప్ప, సురేంద్రరెడ్డి, ఆర్‌బికె అధికారులు పాల్గొన్నారు.

గుడుపల్లి: భూమి ఆరోగ్యం, భూసార పరీక్షలపై మండలంలోని కనుమనపల్లి ఆర్‌బికె పరిధిలోని సిబ్బందికి, రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఏడిఏ అన్నపూర్ణ తెలిపారు. గురువారం కనుమనపల్లి రైతు భరోసా కేంద్ర పరిధిలోని భూమి ఆరోగ్యం, భూసార పరీక్షలు చేసే విధానంపై సిబ్బందికి, రైతులకు మండల స్థాయి శిక్షనా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. సర్పంచ్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని ఒడ్డేపల్లి రైతు భరోసా కేంద్రంలోని సిబ్బందికి, రైతులకు మండల వ్యవసాయ అధికారి మధురవాణి భూసార పరీక్షలు అవశ్యకత గురించి వివరించారు. అనంతరం మట్టినమూనా సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలిపారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినయనపల్లి రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయధికారి మునికష్ణ ఆధ్వర్యంలో భూసారపరీక్ష- మట్టినమూనా సేకరణలపై మండల పరిధిలోని వ్యవసాయ సహాయకులకు గురువారం అవగాహన కల్పించారు.

గృహ నిర్మాణంలో ప్రగతి లేకుంటే

ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు తాఖీదులు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న గృహనిర్మాణంలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. గడిచిన రెండు వారాలుగా మండల ప్రగతి జిల్లాలో దిగజారుతూ వస్తోందని ఇది మంచి పరిణామం కాదని ఎంపిడిఓ అన్నారు. గృహనిర్మాణ ప్రగతిపై సమీక్ష సమావేశం గృహ నిర్మాణశాఖ అధికారులతో, ఇంజనీరింగ్ అసిస్టెంటులతో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ నిర్వహించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ గహ నిర్మాణంలో ప్రగతి కనపర్చని అమ్మరాజుపల్లి, అప్పినపల్లి, చలమంగళం, చామనేరు, తుర్లపల్లి, లింగాపురం, పెద్దకాపల్లి, రాయలపేట1, శంకర్రాయలపేట ఇంజనీరింగ్ అసిస్టెంటులకు తాఖీదులు ఇవ్వడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పేదల పక్షాన ఉండాలని, పేదలకు ఇల్లు కట్టించే విషయంలో ప్రత్యేకశ్రద్ధ వహించాలని అన్నారు. గత మూడునెలలుగా పెద్దపంజాణి మండలం గృహ నిర్మాణ ప్రగతిలో మిగిలిన మండలాలకు ఆదర్శంగా ఉంటే కొంత మంది సిబ్బంది అలసత్వం వలన ప్రగతిలో వెనుకపడ్డామన్నారు. విధులు సక్రమంగా నిర్వహించని సిబ్బందిపై చర్యలు తప్పవని అన్నారు. హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ సహాయకులు ఆర్.రాజేంద్రన్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ ఇంజనీర్లతో మాట్లాడుతున్న ఎంపిడీవో

సమస్యలమయం.. నాయుడుపేట..!

- తప్పని ట్రాఫిక్ కష్టాలు
- పట్టించుకోని పోలీసులు, అధికారులు

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేటలో రోజురోజుకు సమస్యలు పేరుకుపోతున్నాయి. పేరుకు మాత్రమే మునిసిపాలిటీ, డీఎస్పీ కేంద్రం. అయితే ప్రజల్లో అసలు అధికారులున్నారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అందుకు తగ్గట్టు అధికారుల వ్యవహార శైలి ఉంది. అధికార పార్టీ ఎమ్మెల్యేనో.. మంత్రినో వచ్చినప్పుడు తప్ప ప్రజల సమస్యల విషయంలో మాత్రం ఎప్పుడు ఏ ఒక్క అధికారి కనిపించరు. ఎవరైనా పట్టణంలోని సమస్యల గురించి అధికారుల ముందు ప్రస్తావించినా.. అవేవీ పెద్ద సమస్యలు కాదన్నట్టు వినేందుకు సైతం ఇష్టపడటం లేదు. వీటిలో ప్రజలు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా నాయుడుపేటలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతోంది. అయితే పోలీసులు పట్టించుకోవడం లేదు. పోలీసులు కేవలం ద్విచక్ర వాహనాలకు చలానాలు విధించడం పైనే ఆసక్తి చూపుతున్నారు తప్ప ట్రాఫిక్ సమస్యను పూర్తిగా విస్మరిస్తున్నారు. భారీ వాహనాలను ఎప్పుడైనా.. ఎక్కడైనా ఎంత రద్దీగా ఉన్న సమయంలోనైనా రోడ్డుపైనే ఆపేసి వాళ్ల పనులు చేసుకుంటున్నారు. ఆటోలు రోడ్డు కడ్డంగా ఆపేస్తున్నారు. అయినా పోలీసులు కన్నెత్తి చూడటం లేదు. వ్యాపారులు దుకాణాల ఎదుట ఆక్రమించుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. మున్సిపాలిటీ వారికీ ఏమాత్రం సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు.

గతంలో నియమాలు పాటించారు

గతంలో భారీ వాహనాలకు, ఆటోలకు పోలీసులు ఒక నిర్దిష్టమైన సమయాన్ని కేటాయించి ప్రజలకు ట్రాఫిక్‌తో సమస్యలు తలెత్తకుండా ఓ నియమావళిగా వాహనాలు నడిచేలా పోలీసులు జాగ్రత్తలు పాటించారు. వాహనదారులు సైతం భయంతో నడుచుకునేవారు. అయితే నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా ప్యాపారులు ఆక్రమణలే దర్శనమిస్తున్నాయి. రోడ్లను ఆక్రమిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. ఇకనైనా మున్సిపాలిటీ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అమ్మవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. బలగం చిత్ర దర్శకుడు వేణు, హాస్యనటుడు రచ్చ రవి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద సూపరింటెండెంట్ శేషగిరి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారు అమ్మవారిని వీఐపీ బ్రేక్ దర్శనంలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానంతరం వారికి ఆలయాధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కార్గో ఏజెన్సీలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఏపీఎస్ఆర్టీసీ పార్సిల్ బుకింగ్ ఏజెన్సీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పుత్తూరు డిపో మేనేజర్ ప్రశాంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పుత్తూరు ఆర్టీసీ డిపో పరిధిలోని నారాయణవనం, తడుకుపేట, అరక్కోణం, తిరుత్తని, కంచి, పల్లిపట్టు, వడమాలపేట, గాజులమండ్యం, కార్వేటినగరంతోపాటు ప్రతి విలేజ్‌కి సైతం ఏజెన్సీలు ఇస్తారన్నారు. ఏజెన్సీ నిర్వహణకు డిపాజిట్ కింద రూ.1000, రూ.2500, రూ.5000 చెల్లించాలని పేర్కొన్నారు. ప్రతి పార్సిల్ బుకింగ్ కమిషన్ కింద 15 శాతం కమిషన్ ఇస్తారని తెలిపారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలకు డోర్ డెలివరీ సదుపాయం ఉందని.. అన్ని ప్రాంతాలతోపాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వేలూరు, బళ్లారి, తిరువన్నామలై తదితర నగరాలకు బల్క్ బుకింగ్, డిక్కీ బుకింగ్, రూఫ్ టాప్ బుకింగ్, డిజిపి బుకింగ్ (పది టన్నులు) అవకాశం ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబరు 7382882470 ను సంప్రదించాలని కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండలంలోని వేలికాడు, కారికాడు, మీజూరు, బేరిజంగాలపల్లి, తొగరాముడి ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 111 మంది విద్యార్థులకు గురువారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ముందస్తు వేడుకల సందర్భంగా జైభీమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని ఎంఈవో మస్తానయ్య చేతుల మీదుగా అందించారు. ఎంఈవో మాట్లాడుతూ జైభీమ్ ట్రస్టు ఇలాంటి మంచి కార్యక్రమాలకు ఏర్పాటు చేసినందుకు ముందుగా ఉపాధ్యాయుడు ట్రస్ట్ ఫౌండేషన్ ఛైర్మన్ శేషయ్యను అభినందించారు. ట్రస్టుతో పేద విద్యార్థులకు ఇలాంటి సహాయ సహకారం అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు మల్లేపల్లి సిద్ధార్థ, మల్లేపల్లి గౌతమ్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు సతీష్, కృష్ణయ్య, మోహనకృష్ణ, బాబూరావు, రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత అందరిమ హదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకున్న మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గురువారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిన్న వయసు నుంచి కుల అసమానతలను ఎదుర్కొని పట్టుదలతో ఎన్నో కష్టాలను అధిగమించారన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, అధ్యాపకులు విష్ణు ప్రకాష్, దేవకి, నరసింహులు, రెడ్డినాయక్, శాంసన్ రాజ్, వాసవి, కందేరి శ్రీదేవి, రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

26 లోపు 'వాత్సల్య'కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించిన దరఖాస్తులు ఈనెల 26 లోపు స్వీకరించనున్నట్లు పుత్తూరు సీడీపీవో పద్మజ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో మాట్లా డుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో 18 సంవత్సరాల లోపు అనాథలైన బాల బాలికలు, తండ్రిని కోల్పోయిన వారందరూ వితంతువు, విడాకులు తీసుకున్న వారు, కుటుంబం వదిలివేసిన తల్లి పిల్లలు, ప్రాణాంతకర వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, ఆర్థికంగా, శారీరకంగా పిల్లలను పెంచలేని నిస్సహాయులు అర్హత పొందుతారన్నారు. ఈ పథకం కేంద్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఓ కుటుంబంలో ఇద్దరు పిల్లల వరకు ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలు ఆదాయం కలిగిఉన్న వారు అర్హత పొందుతారన్నారు. అర్హత పొందిన పిల్లలకు ప్రతి నెలా రూ.4 వేలు చొప్పున ఆర్థిక చేయూత ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అర్హత కలిగిన వారందరి వివరాలు అంగన్‌వాడీ కార్యకర్తలు గుర్తించాలన్నారు. సూపర్‌వైజర్లు భారతి, గీతాంజలి, కృష్ణవేణి, రోజా రమణి పాల్గొన్నారు.

17న ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాలు

ప్రజాశక్తి -సత్యవేడు: ఈనెల 17, 18 తేదీలలో రెండురోజుల పాటు తిరుపతి కేంద్రంగా జాతీయ కార్యవర్గ సమావేశాలు జరుగుతాయని ఉమ్మడి చిత్తూరు జిల్లా కోకన్వీనర్ రాగిపట్టు రాఘవయ్య తెలిపారు. కార్యక్రమాలకు ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ పాల్గొంటారని పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నాయకులు, కార్యకర్తలతో పాటు చదువుకున్న యువత, మహిళలు పాల్గొని జాతీయ కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అర్హులందరికీ భూముల పంపిణీ

ప్రజాశక్తి- గూడూరు: నియోజకవర్గం పరిధిలోని గూడూరు మండలంలో అనేక సంవత్సరాలుగా అభ్యంతరం లేని భూములను సాగు చేస్తున్న వారికే పంపిణీ చేసేందుకు పేర్లు నమోదు చేసుకొని ప్రభుత్వానికి పంపుతామని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో భూపంపిణీకి పేర్లు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి అర్జీలను అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వరప్రసాద్, ఎమ్మెల్సీ మురళి హాజరయ్యారు. ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీకి శ్రీకారం చుట్టిందని.. అనేక సంవత్సరాలుగా భూమిని సాగు చేస్తున్న వారికే భూ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తహశీల్దారు లీలారాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





అంబేద్కర్ విగ్రహం

సుందరీకరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు దర్గా సర్కిల్ వద్దనున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన సుందరీకరణ పనులను నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ గురువారం రాత్రి పరిశీలించారు. అంబేద్కర్ జయంతి నేపథ్యంలో దర్గా కూడలి వద్దనున్న అంబేద్కర్ విగ్రహం సుందరీకరణ పనులు గడిచిన కొన్ని రోజులుగా జరుగుతున్నాయి. విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన నూతన అలంకరణ మొక్కలు, గ్రానైట్ బండలు, ఇతర పనులను కమిషనర్ పరిశీలించారు. పెండింగ్ పనులను రాత్రికి పూర్తిచేసి ఉదయానికల్లా సుందరీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. లైటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయడంపై అధికారులకు మార్గదర్శకం చేశారు. కార్యక్రమంలో ఎంఈ ధనలక్ష్మి, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి

డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని జక్కదొన పంచాయతీలో గురువారం గడపగడపు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సిఎం కళత్తూరు నారాయణస్వామి హాజరయ్యారు. జక్కదొన హరిజనవాడ, జక్కదొన, గంటావారిపల్లి, నంబాలపల్లి గ్రామాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంపిపి బండి నాగరాణి అధ్యక్షతన జరిగింది. ప్రతిఒక్క గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ ఉద్యోగి అంకితభావంతో ప్రజలకు సేవ చేయాలని, సమస్యను గుర్తించి పరిష్కరించే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో గంగాధర నెల్లూరు కన్వీనర్ బోడిరెడ్డి నారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజీ మార్గంలో సమన్యాయం

న్యాయ సేవా అధికార సంస్థ ముఖ్య ఉద్దేశం

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి
సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ. కరుణ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాజీ మార్గంలో దీర్ఘకాలికంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోకుండా ఇరువురి మధ్య రాజీకుదర్చి కక్షదారుల సమక్షంలో ఇద్దరి ఆమోదంతో రాజీమార్గంలో సమస్యను పరిష్కరించుకొనేందుకు మధ్యవర్తిగా న్యాయసేవా అధికార సంస్థ పనిచేస్తుంది. ఇందుకోసం న్యాయ సేవాఅధికార సంస్థ లోక్అదాలత్ కార్యక్రమాలు నిర్వహిస్తుంది. పెండింగ్‌లో ఉన్న కేసులు లోక్అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చు. ఇలా దేశవ్యాప్తంగా అనేక కేసులు పరిష్కరించబడ్డాయి. ప్రభుత్వ రంగ, ప్రయివేటు రంగ సంస్థల్లో ఆర్థిక సమస్యలు, పన్ను బకాయి కేసులు ఇలా ఒక్కటేమిటి అన్ని రకాల కేసులు లోక్అదాలత్‌ను ఆశ్రయించి పరిష్కరించుకోవచ్చు. ఇందుకు ఇరువర్గాల మధ్య రాజీ ముఖ్యం. సమస్యలను మరింత జఠిలం చేసుకోకుండా తక్షణ న్యాయం పొందవచ్చు. ఇరు వర్గాల సమ్మతితో రాజీచేసిన అనంతరం అన్యాయం జరిగిందంటూ పైకోర్టును ఆశ్రయించే అవకాశముండదు. కేసుల పరిష్కారం కోసం లోక్అదాలత్‌లను ఆశ్రయించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని జిల్లా న్యాయ సేవాఅధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ తెలిపారు. ప్రజాశక్తి దినపత్రిక ప్రత్యేక ఇంటర్వ్యూ....

ప్రజాశక్తి: న్యాయ సేవా అధికార సంస్థ ఎప్పుడు... ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చింది...?

సీనియర్ సివిల్‌జడ్జి: మనకు స్వాతంత్ర వచ్చిన తొలినాళ్ళలో జనాభాకు తగ్గటుగా కోర్టులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు లేని సమయంలో అత్యధికంగా ఉన్న కేసుల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా న్యాయసేవాధికార సంస్థలను ఏర్పాటు చేయడం జరిగింది. అప్పటి వరకు ఉన్న కేసుల్లో సత్వర న్యాయం అందించాలన్నదే ప్రధాన ఉద్దేశం.

ప్రజాశక్తి: ఎలాంటి కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరిస్తారు...?

సీనియర్ సివిల్‌జడ్జి: ప్రత్యేకించి ఇలాంటి కేసులంటూ ఉండవ్... అన్ని రకాల కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చు. ఎలాంటి ఖర్చు ఉండదు. రాజీ తరువాత కేసులు కొట్టివేయబడతాయి. కోర్టుల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకుండా లోక్అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం మంచిది.

ప్రజాశక్తి: న్యాయసేవా అధికార సంస్థలు ఎక్కడ ఉన్నాయి...?

సీనియర్ సివిల్‌జడ్జి: న్యాయసేవా అధికార సంస్థలు సుప్రీమ్ కోర్టు, హైకోర్టు, జిల్లా కోర్టు మండల కోర్టు పరిధిలో ఉంటాయి. వీటికి ఆయా స్థాయిలో నియమించిన సీనియర్ జడ్జీలు కార్యదర్శులుగా వ్యవహరిస్తారు. జిల్లాలో 13 మండలాల్లో కోర్టులున్న చోట లీగల్ సర్వీసెస్ ఉన్నాయి. రాజ్యాంగ పరంగా అందించే ఆర్టికల్ 39 ఏ సద్వినియోగం చేసుకోవాలి.

ప్రజాశక్తి: చట్టాలపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరముందా...?

సీనియర్ సివిల్‌జడ్జి: ప్రతిఒక్కరూ ప్రాథమిక చట్టాలను తెసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాజ్యాగం కల్పించిన హక్కులతో పాటు విధులు కూడా తెలిసి ఉండాలి. రాజ్యాగం ప్రతి ఒక్కరికీ చట్టపరంగా కొన్ని హక్కులు కల్పించింది. వీటిని తెసుకోవడం వల్ల సమాజం పట్ల మంచి అవగాహనతో మంచి పౌరులుగా మెగిలే అవకాశముంటుంది.

ప్రజాశక్తి: న్యాయసేవా అధికార సంస్థ చట్టాలపై అవగాహన కల్పిస్తోందా...?

సీనియర్ సివిల్‌జడ్జి: న్యాయసేవా అధికార సంస్థ లోక్అదాలత్ కార్యక్రమాలతో పాటు చట్టాలపై అన్ని వర్గాలకు అంటే మహిళలు, చిన్నపిల్లలు, యువతీ, యువకులకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన వారికి రాజ్యాగం కల్పించిన ప్రత్యేక హక్కులను తెలియజేయడం జరుగుతోంది. అలాగే వివిధ కేసుల్లో జైల్లో ఉన్న వారు తమ కేసులను వాదించేందుకు న్యాయవాదులను పెట్టుకొనే ఆర్థిక పరిస్థితి లేకున్నా న్యాయసేవా అధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయ సేవలను అందించడం జరుగుతుంది. జిల్లాలో 6లక్షల మంది విద్యార్థులకు 30వేల మంది యువలకు చట్టాలపై అగాహన కల్పించాం. గిరిజన కాలనీలపై ప్రత్యేకంగా పొందల మండుగు అనే ఎస్‌టి కాలనీకి న్యాయసేవా అధికార సంస్థ చొరవతో ఆర్‌టిసి బస్సును నడపడం జరుగుతోంది. హిజ్రాలకు కూడా చట్టపరంగా హక్కులున్నాయి. తక్కువ చేసి మాట్లాడం, చులకన చేయడం వంటివి చట్టరీత్య నేరం. హిజ్రాలకు ఈసరం కార్డులు ఇప్పించాం.

ప్రజాశక్తి : పోలీస్ కేసులు లేని గ్రామం ఏదైనా ఉందా...?

సీనియర్ సివిల్‌జడ్జి: పోలీస్ కేసులు లేని గ్రామం అంటే ఇటీవల గుడిపాల మండలం తమిళనాడు సరిహద్దులో ఓ గ్రామాన్ని సందర్శించడం జరిగింది. ఆ గ్రామం పేరు రాయలచేను ఈ గ్రామంలో ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. చిన్నచిన్న తగాదాలుంటే అక్కడి గ్రామపెద్దల సమక్షంలో గ్రామస్తులందరూ కలసి పరిష్కరించుకుంటారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానంపై మక్కువ చూపాలి

కుటీర పరిశ్రమలను పరిశీలిస్తున్న జీవనోపాధుల అదనపు డైరెక్టర్ విజయ్‌కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రైతులు సాంకేతిక పరిజ్ఞానం పట్ల మక్కువ చూపాల్సిన అవసరం ఉందని ఏపీ జీవనోపాదుల అదన డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. గురువారం డిఆర్‌డిఏ పిడి తులసి ఇతర అధికారులతో కలిసి ఆయన జిల్లాలో పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఎస్ఆర్ పురం మండలం నెలవాయి సమీపంలో మహిళా చెరకు రైతులతో మమేకమై, చెరకు సాగుపరంగా జీవన వనరులు ఎలా ఉన్నాయి. పంట సాగుకు ఎంత ఖర్చు అవుతుంది, దిగుబడి ఎంత వస్తుంది, మార్కెటింగ్ సదుపాయాలు ఎలా ఉన్నాయన్న విషయాలను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవన వనరులు పెరగాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఆ దిశగా పంటలను సాగుచేస్తే మంచి దిగుబడితోపాటు అధిక లాభాలు పొందవచ్చునని సూచించారు. ఇందుకు ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం గంగాధరనెల్లూరు మండలం కలవకుంటా సమీపంలో తెల్ల జిల్లేడుతో బొమ్మలు తయారు తయారుచేసి ఉపాధి పొందుతున్న మహిళలతో మమేకమయ్యారు. ఈసందర్భంగా తెల్లజిల్లేడు బొమ్మల ప్రాముఖ్యత, తయారు చేసేవిధానం, మార్కెటింగ్ సదుపాయాలు తదితర విషయాలపై సమీక్షించారు. చేతివత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా డిఆర్డిఏ పీడీ తులసి మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాల్లో స్వయం సహాయ సంఘాల సభ్యులు తెల్లజిల్లేడుతో వివిధ రకాల బొమ్మలు తయారు చేస్తున్నారని, జిల్లాలో చేతివత్తుల వారిని ప్రోత్సహించడానికి డిఆర్‌డిఏ ద్వారా రుణాలు అందిస్తున్నామని వివరించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ చేతివత్తుల వారిని ప్రోత్సహించడానికి పలు చర్యలు చేపట్టామని, వీరు తయారు చేస్తున్న వస్తువులను మహిళ మార్ట్‌లో ఉంచి విక్రయించే అవకాశం కూడా కల్పించినట్లు తెలిపారు. డిపిఎం మధు, ఏపిఎంలు సూరి చిరంజీవి, రోజా, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పంటపొలాల్లో
ఒంటరి ఏనుగు హల్‌చల్

భయాందోళనలో రైతన్నలు
పరిష్కారం చూపాలంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్ మండలంలోని ఏటిగడ్డ గ్రామంలో బుధవారం రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఓ ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. పెరుమాళ్ అనే రైతుకు చెందిన వరిపంటతో పాటు పశుగ్రాసాన్ని తిని తొక్కి ధ్వంసం చేసింది. పుష్పరాజ్ అనే రైతుకు చెందిన ఐదు ఎకరాల వ్యవసాయ భూమిలో ఏనుగుల దాడులకు భయపడి సోలార్ కంచెను ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఒంటరి ఏనుగు సోలార్ కంచెను తొలగించి రాతి కూసాలను విరిచేసి మామిడి తోటలోకి ప్రవేశించి మామిడి కొమ్మలను విరిచి నష్టపరిచింది. ఉదయం ఒంటరి ఏనుగు శబ్దాలకు పక్కనున్న రైతులు చూసి అటవీశాఖ అధికారులకు తెలియపరచడంతో పక్కనే ఉన్న ట్రాకర్స్ ఆ ఒంటరి ఏనుగును పక్కనే ఉన్న అడవిలోనికి మళ్ళించారు. రాత్రికి మళ్ళీ ఏటిగడ్డ గ్రామానికి ఒంటరి ఏనుగు రావచ్చునని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ ఒంటరి ఏనుగు నిన్న రాత్రి మొసలిమడుగు గ్రామసమీపంలో చెరువుకింద వ్యవసాయ భూమిలోనే ఇల్లు నిర్మించుకుని ఉన్న అమరావతమ్మ అనే రైతుకు చెందిన పొలంలోనికి ప్రవేశించి పశగ్రాసాన్ని తొక్కి నాశనం చేసి అక్కడున్న ఇంటి కిటికీలను ధ్వంసం చేసి ఇంటిలోని పశు వుల దాణా, ధాన్యం బస్తాలను బయటకు తీసి తిన్న వరకు తిని చిందరబందరగా పారేసింది. ఈసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఏనుగు గాండ్రింపులకు అక్కడున్న పశువులు భయాందోళనకు గుర్రై పరుగులు తీశాయి. అలాగే దామోదర నాయుడు అనే రైతుకు చెందిన పశుగ్రాసాన్ని తని ధ్వంసం చేసి కుంటకు పక్కనే వున్న చంద్రశేఖర్ నాయుడు అనే రైతు మామిడి తోటలో ప్రవేశించి కాయలను తిని కొమ్మలను విరిచి ధ్వంసం చేసింది. గమనించిన చంద్రశేఖర్ నాయుడు వారి కుటుంబ సభ్యులందరూ అటవీశాఖ ట్రాకర్స్‌లకు సమాచారం అందించారు. అప్పటికే అక్కడున్న ట్రాకర్స్ ఆఒంటరి ఏనుగును ఉదయం అడవిలోనికి మళ్ళించారు. ఈ ఏనుగు గత మూడు రోజులుగా మొసలిమడుగు, ఏటిగడ్డ ప్రాంతాల్లోనే సంచరిస్తూ పంటనష్టాలతో పాటు అటు రైతులను ఇటు పశువులను భయభ్రాంతులకు చేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవచూపి ఏనుగులు పంట పొలాలపై రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విజయానంద రెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కరోనా కాలంలో అంతంత మాత్రంగా వ్యాపారం ఉన్న సమయంలో చిత్తూరు నగరంలో చిరు వ్యాపారులు ఎలాంటి గేట్ వసూలు చేయకుండా ఉచితంగా వ్యాపారం నిర్వహించుకునేలా ఎపిఎస్ ఆర్‌టిసి వైఎస్ ఛైర్మెన్ విజయానందరెడ్డి తన సొంత నిధులు ఖర్చు చేయాడాన్ని పలువురు చిరువ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. మూడు సంవత్సరాలుగా తన సొంతనిధులు ఖర్చుచేసి చిరు వ్యాపారులను ఆదుకుంటున్న విజయానందరెడ్డికి అండగా ఉంటామని గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిరువ్యాపారులు తెలిపారు. సంపాదించిందంతా గేట్లు కట్టి మూడుపూట్లా కడుపునిండా తినలేని పరిస్థితిలో ఉన్న తమకు గమనించిన విజాయానందరెడ్డి స్పందించి మంత్రి పెద్దిరెడ్డి, మిధున్ రెడ్డిలతో మాట్లాడి మార్కెట్ వేలంపాటను దక్కించుకొని ప్రజలకు అంకితం చేశారని అన్నారు. మల్లిక, నాగవల్లి, అను, చిరువ్యాపారులు పాల్గొన్నారు.

ప్రకృతి సంపదను దోచుకుంటున్నారు

ప్రజాశక్తి- నగరి: నగరి నియోజకవర్గంలో వైసిపి నాయకులు కొండలు, గుట్టలతోపాటు ప్రకృతి సందపను దోచుకుంటున్నారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఆరోపించారు. గురువారం నగరి కస్తూరి కళ్యాణ మండపంలో నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త కూడా మీద పన్ను వసూళు చేస్తున్న చెత్త ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని పన్నుల పెంచి ప్రజలను దోచేస్తున్నారని అన్నారు. వైసిపి అంటేనే ప్రజలు తిరగబడుతున్నారని అన్నారు. కరెంటు ఛార్జీలు ఎనిమిది సార్లు పెంచి వేలకోట్ల భారం ప్రజలపై మోపారని, కల్తీ మద్యంతో ప్రజలు ఆరోగ్యం నాశనం చేస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రానికి, నగరికి పట్టిన దరిద్రం పోవాలంటే తెలుగుదేశం రావాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌లెవల్ నాయకులు ఓటరు లిస్ట్‌పై అప్రమత్తంగా ఉండి, జాగ్రత్తపడాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ చెన్నూరు సుధాకర్, చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, అధికార ప్రతినిధి చినబాబు, ధనంజేయులు నాయుడు, సెక్రటరీ ఆర్. బాలాజీ, మండల పార్టీ ప్రెసిడెంట్‌లు రమేష్‌బాబు, శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీకి మార్కింగ్

ప్రజాశక్తి- రొంపిచెర్ల: రొంపిచర్ల గ్రామపంచాయతీలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఇండ్ల పట్టాల పంపిణీ కోసం మార్కింగ్ ఇచ్చినట్లు సర్పంచ్ ఇబ్రహీంఖాన్ తెలిపారు. 171మందికి పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసిందని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఒకటన్నర సెంటుస్థలం ఇస్తామని తెలిపారు. త్వరలోనే ఇళ్లపట్టాలను అందజేస్తామని అన్నారు. అందరికీ పక్కా ఇల్లు కూడా మంజూరు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈకార్యక్రమంలో మండల సర్వే సులోచన, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వనజ, పంచాయతీ కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు, వైయస్సార్ సిపి నాయకులు శ్రీపతి, లక్ష్మయ్య, చిన్న నాగరాజా, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

జి.డి.నెల్లూరు టిడిపి అభ్యర్థి ఖరారు..!

ప్రజాశక్తి- వెదురుకుప్పం: గంగాధర నెల్లూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దాదాపుగా ఖరారైనట్లు ప్రచారం ఊపందుకుంటోంది. గతంలో టిడిపి తరపున గుమ్మడి కుతూహలమ్మ, ఆమె కుమారుడు పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం హరికృష్ణ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి నియోజకవర్గానికి సరైన నాయకులు లేరు.

గతంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్వేటినగరం మండలంలో బాదుడేబాదుడు కార్యక్రమాన్ని చేపట్టారు. పల్లం రవికుమార్ (గ్యాస్ రవి) 70 కిలోమీటర్ల మేర బ్యానర్, కటౌట్లు బెలూన్లతో ఆర్చిల్తో రోడ్డుకు విలువైపులా నింపేసి చంద్రబాబు దష్టి తన వైపు మళ్ళించుకున్నారు. దీనికి తోడు ఎన్నికలు దగ్గర పడుతుండడంతో నారా లోకేష్ యువగళం పేరుతో గంగాధర నెల్లూరులో పాదయాత్ర చేరుకుంది. అప్పుడు గ్యాస్ రవికుమార్ పేరు తెరపైకి వచ్చింది. జీడి నెల్లూరు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రవికుమార్ అని ప్రచారం ఊపందుకుంది.

నియోజకవర్గాన్ని పరిశీలిస్తే...

జిడి.నెల్లూరు నియోజకవర్గం పునర్విభజన తర్వాత కేటాయించారు. ఇందులో వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్‌ఆర్.పురం, పాలసముద్రం, గంగాధర నెల్లూరు, పెనుమూరు మండలాలు ఉన్నాయి. మాజీమంత్రి గుమ్మడి కుతుహలమ్మ, ఆమె కుమారుడు హరికష్ణ తెలుగుదేశం తరపున ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేసి ఓడిపోయారు. వీరిపై వైసీపీ అభ్యర్థి నారాయణస్వామి గెలిచి మంత్రి అయ్యారు. అప్పటినుంచి హరికష్ణ తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి కనుమరుగయ్యారు. ఆపార్టీ కార్యక్రమాలు తగ్గుముఖం పట్టాయి. తెలుగు తమ్ముళ్ల నిరాశ నిసహ ఏర్పడింది. ఈవిషయాన్ని నియోజకవర్గ నాయకులు అధిష్టానం చంద్రబాబునాయుడి దష్టికి తీసుకెళ్లారు. యువగళం పాదయాత్ర గంగాధర నెల్లూరుకి చేరుకోవడంతో ఈ యాత్రను విజయవంతం చేయడానికి గ్యాస్ రవికుమార్ చేసిన ప్రయత్నాలు, కషి నాయకులను కలుపుకొని పాదయాత్రను విజయవంతం చేయడం, ఆయన ప్లానింగ్ అధిష్టానానికి నచ్చింది. అతని వైపు మొగ్గు చూపుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన రవికుమార్

వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం హరిజనవాడలో స్వామివేలు వసుమతిలది ఓ సామాన్య రైతు కుటుంబ. ఈ కుటుంబంలోనే రవికుమార్ జన్మించారు. ఉన్నత చదువులు చదువుకుని డాక్టరేట్ చేశారు. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని ఎదిగారు. సుమారుగా 10కి పైగా అవార్డులను అందుకున్నారు. ప్రధానంగా మాజీమంత్రి ముద్దుకష్ణమ నాయుడి అనుచరుడు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ.... గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆరు మండలాలలో బంధువులు, స్నేహితులు తెలిసినవారు ఎక్కువగా ఉన్నారు. అందర్నీ కలుపుకుని తెలుగుదేశం పార్టీ అభివద్ధికి కషి చేస్తాను. సమన్యాయం, నాయకత్వం పాటిస్తాను. మొదటినుంచి నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాను. కరోనా సమయంలో పేదలకు చాలా చోట్ల నిత్యావసర సరుకులను పంపిణీ చేశాను. నాకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం గంగాధర నెల్లూరు నియోజకవర్గం టికెట్టు ఇస్తే ప్రత్యర్థిపై గెలిచి చంద్రబాబు నాయుడుకి బహుమతిగా ఇస్తాను అన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని ఉనిసిగానిపల్లి గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు గత నెలలో వైయస్సార్ ఆసరా సభ రామకుప్పంకు వస్తున్న సమయంలో మార్గమధ్యమైన కష్ణరాజపురం వద్ద బొలెరో వాహనం బోల్తా పడి 35మంది గాయపడ్డారు. వారికి ఎమ్మెల్సీ భరత్, వైసిపి నేతలు గురువారం ఆర్థిక సహాయం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 12లక్షల 75 వేల రూపాయలను చెక్కును గాయపడిన వారికి అందించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అండగా ఉండి మనోధైర్యాన్ని అందించడం జరుగుతుందన్నారు. తహశీల్దార్ మురళి, ఎంపీడీఓ ఎస్ఐ.కష్ణయ్య, జడ్పిటిసి నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, వైసిపి మండల అధ్యక్షుడు బాబురెడ్డి, కోకన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ నేత్రావతి నాగిరెడ్డి, ఎంపిటిసి సులోచన, నేతలు గుర్రప్ప, సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, రాంబాబు, జయప్ప, కేశవరెడ్డి, నరసింహులు, యశ్వంత్ రెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అసిస్టెంట్ వార్డెన్ అరాచకాలు అరికట్టండి

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మహిళల హాస్టల్‌లో అసిస్టెంట్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె అక్కడ పనిచేసే తమపై భౌతికంగా, మానసికంగా దాడిచేసి ఇబ్బందులు పాలు చేస్తుందని ఆ సంఘం నేతలు, బాధితులు ఆరోపించారు. గురువారం సాయంత్రం బాలికల వసతి గహం-1 ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నిర్వహిస్తున్న బాధితులకు ఏఐఎస్ఎఫ్, కార్మిక సంఘాలు నేతలు తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు, ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా హాస్టల్ అసిస్టెంట్ వార్డెన్ గా ఉన్నటువంటి గౌతమి తమల్ని ఇబ్బందులు పాలు చేస్తుందని, భౌతిక దాడులు పాల్పడుతుందని వార్డెన్‌లు భారతి, అనురాధలకు ఎన్నోసార్లు విన్నవించామని అన్నారు. మహిళల హాస్టల్‌లో వంట చేసే వంట మాస్టర్ నుంచి వడ్డించే కూలీల వరకు అందరినీ దుర్భాషలాడుతూ కించపరుస్తుందని.. ఈ అవమానం తట్టుకోలేక ఎన్నో సార్లు ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నామని వారు వెల్లడించారు. గతంలో ఆమెపై ఉన్నతాధికారులకు విన్నవించామని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో ఆమె ఇష్టం వచ్చినట్లు అంటున్నారనిమ వాపోయారు. తక్షణమే ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా వార్డెన్‌గా పనిచేస్తున్న వారిని తొలగించి కొత్త వారికి అవకాశం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ సంఘం నేతలు, కార్మిక సంఘం నేతలు ఉన్నతాధికారులను కోరారు. సమస్యను పరిష్కరించని నేపథ్యంలో లేనిపక్షంలో సోమవారం పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నేతలు బండి చలపతి, చిన్న, ఉదయ్, సుందర్, , నవీన్, టిఎన్ఎస్ నేతలు రామకష్ణ నాయుడు, శరత్ హాస్టల్ కార్మికులు పాల్గొన్నారు.

గుడిపల్లి ఎంపీడీవోగా రమణ

ప్రజాశక్తి- గుడిపల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా గురువారం బి.రమణ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తానని తెలిపారు.

ముందస్తుగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ముందస్తుగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద మాట్లాడుతూ అంబేద్కర్ విశిష్టతను, ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేష్, డిఆర్‌సి కోఆర్డినేటర్ డాక్టర్ సి.అరుణ, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సి.మంగళగౌరి పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం కావాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాల్లో చేపడుతున్న రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులను త్వరగా పూర్తిచేయాలని భూపరిపాలన ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న రెండో విడత రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్, భూహక్కు పత్రాల పంపిణీపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుంచి డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా భూపరిపాలన ప్రత్యేక ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ రీసర్వే, స్టోన్‌ప్లాంటేషన్ పనులు మరింత వేగవంతం కావాలన్నారు. స్టోన్ ప్లాంటేషన్ కొరకు అవసరమైన అదనపు రోవర్లను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. రీసర్వే, స్టోన్‌ప్లాంటేషన్ లక్ష్యాలను అధిగమించాలన్నారు. రైతుల పేరిట ఉన్న భూవిస్తీర్ణం వెబ్ ల్యాండ్‌లో నమోదు అయిన భూవిస్తీర్ణవం సరిగా ఉన్నది లేనిది పరిశీలించాలని అన్నారు. జిల్లాలో రీసర్వే కార్యక్రమం పూర్తి అయిన 134 గ్రామాలకు సంబంధించి సర్వేరాళ్లు నాటే కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేస్తున్నామని, సర్వే రాళ్ళునాటే లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 35,199 సర్వే రాళు నాటే ప్రక్రియను పూర్తయిందని లక్ష్యాన్ని పూర్తి చేస్తామని డిఆర్‌ఓ వివరించారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ ఫర్వీన్, పిఓఎల్‌ఆర్ డిటి శివ, డిఎస్ఎల్ఓ ఆఫీస్ సర్వేయర్ గణేష్, ఇతర సర్వేఅధికారులు పాల్గొన్నారు.

తెల్లజిల్లేడుతో వినాయక బొమ్మలు తయారీని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండలంలోని కడపగుంట దళితవాడ తెల్లజిల్లేడుతో వినాయక బొమ్మలను తయారుచేసే లబ్ధిదారుల ఇళ్లను డీఆర్డీఏ పీడీ తులసి, సెర్ఫ్ అధికారి విజయ్‌కుమార్‌లు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా కడపగుంట దళితవాడలో తెల్లజిల్లేడుతో వినాయకుని బొమ్మల తయారీదారులతో ముడి సరుకు ఎక్కడి నుండి తెచ్చుకొని బొమ్మల్ని తయారు చేస్తున్నారని, రోజుకి ఎన్ని బొమ్మలు తయారుచేసి ఎంత ఆదాయం గడిస్తున్నారని వారి వద్ద అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎపిఎం చిరంజీవి, మాజీ సర్పంచ్ షణ్ముగం, జీవనోపాధి అధికారిణి నీరజ, సీసీ వెంకటేష్, సుధారాణి, సూరి పాల్గొన్నారు.

రాస్ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్రీయ సేవా సమితి రాస్ మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో పుత్తూరు ఆరేటమ్మ ఆలయం ఆవరణంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆలయ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయం ఆవరణలో రాస్ పొదుపు సంఘాల సమావేశాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని.. వేసవి సందర్భంగా దాహాన్ని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. కార్య క్రమంలో రాస్ అధికారి రవి, మీనా, సుజాత, జమున,వరలక్ష్మి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఉచితంగా తమ కళాశాలలో శిక్షణ ఇస్తామని కళాశాల ప్రిన్సిపల్ రవికష్ణ తెలిపారు. ఈనెల 17 నుంచి మే 5వ తేదీ వరకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సందేహాలు ఉంటే 984 9807725, 9912322600, 9989085540 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులున్న చోటనే పాఠశాలను నిర్మించాలి

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: మండలంలోని కడూరు తాగేలి ప్రాథమిక పాఠశాల వివాదాన్ని అధికారులు వెంటనే పరిష్కరించాలని.. ఎక్కువ స్థలం, విద్యార్థులు ఉన్న చోట పాఠశాల నిర్మించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజు డిమాండు చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. వివాదాన్ని పరిష్కరించడానికి ఇరు వర్గాలతో అధికారులు, ప్రజాప్రతినిధులు సంప్రదింపులు జరిపి పరిష్కారం చేయకుండా కులాల మధ్య రెచ్చగొట్టారని ఆయన ఆరోపించారు. ఇకనైనా పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకోవాని కోరారు. కార్యక్రమంలో పలవురు నాయకులు పాల్గొన్నారు.

మారియమ్మ సేవలో ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి-సత్యవేడు: పుదుకుప్పం గ్రామంలో జరుగుతున్న మారియమ్మ జాతరలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం పాల్గొన్నారు. వైసిపి మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులతో కలిసి అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపిటీసీ శరవణ, ఎస్సై పురుషోత్తంరెడ్డి, ఎంపిటీసీ బాలయ్య, దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి, నేతలు పునీత్ కుమార్, శ్రీధర్ రెడ్డి, సెల్వం, ధనపాల్, గోకుల్ తదితరులు ఉన్నారు.

భూసార పరీక్షలతోనే దిగుబడి

బంగారుపాళ్యం: భూసార పరీక్షలతోనే అధిక దిగుబడి పొందవచ్చు అని జిల్లా వ్యవసాయ అధికారి లక్ష్మీ ప్రసన్న అన్నారు. గురువారం మండలంలోని తిమ్మోజిపల్లె రైతుభరోసా కేంద్రం సిబ్బందికి మట్టిపరీక్ష ప్రాముఖ్యత, మట్టి నమూనా తీసే విధానంపై శిక్షణా కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి పద్మజ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యవసాయ సంచాలకులు మధుసూదన్ రెడ్డి, మండల వ్యవసాయ విస్తరణాధికారి సాదరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని నారాయణపురం పంచాయతీలో గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపురం పంచాయతీ వైసిపి ఇన్‌ఛార్జి, సచివాలయ కన్వీనర్ గోపి గౌడ్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సమస్యలతో అల్లాడిపోయారని తెలిపారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నారాయణపురం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: గూడూరు ఒకటో సచివాలయం పరిధిలోని వైసిపి కన్వీనర్ దాసరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంటింటికీ 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యేవరకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్లు దాసరి వెంకటేశ్వర్లు, షేక్ బాబు, ధనమ్మ, గహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అధికారుల తీరు మారకుంటే చర్యలు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: వరదయ్యపాలెంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఆదిమూలం కొన్ని శాఖల అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం వేల లక్షల కోట్లు ఖర్చు పెడుతుంటే దిగువ స్థాయి అధికారులు పనితీరుతో ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత పెరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మండలంలో ఎప్పుడు సమావేశం నిర్వహించినా విద్యుత్ శాఖకు సంబంధించి సమస్యలే అధికంగా వస్తున్నాయని.. సంబంధిత అధికారులు తీరు మారకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేద మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కలను నిజం చేసే ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్క పేదవాడికి భూమి పట్టాలను పంపిణీ చేయాలన్న జగనన్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని తహశీల్దారును ఆదేశించారు. అయితే వరదయ్యపాలెం పంచాయతీలోనే ఇంటి స్థలాలు ఇప్పటికీ కేటాయించకపోవడంపై కొంతమంది స్థానిక నాయకులు నిరసనను తెలిపారు. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. పాలనాపరమైన వ్యవహారంలో అధికారుల పనితీరే

కీలకమని.. అలసత్వం వహిస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని..స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం చెడ్డ పేరు వస్తుందన్నారు. ప్రజా సమస్యలపై వెంటనే అధికారులు స్పందించాలని.. ఆటంకాలు ఉంటే వెంటనే తన దష్టికి తీసుకు రావాలని కోరారు. జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి తనవంతు సహకారం అందిస్తానన్నారు. వేసవి కావడంతో ఎక్కడా నీటి కొరత లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ఎప్పుడు ముందుండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు గౌరీ శంకర్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక ఆదాయం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: భూసార పరీక్షలతో రైతులు ఎరువులను పొదుపుగా వాడి సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తిరుపతి జిల్లా వ్యవసాయ శాఖ వనరుల కేంద్ర ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న భూసార వారోత్సవాల సందర్భంగా బి.ఎన్.కండ్రిగలో ఏర్పాటు చేసిన మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షలు చేయడంఎం భూముల ఆరోగ్య స్థితి, పోషకాలు అందుబాటు, లోపాలు తెలుస్తాయని.. అనుగుణంగా రైతులు యాజమాన్యం పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. శ్రీకాళహస్తి డివిజన్ ఏడీఏ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్.బి.కె సిబ్బంది రైతుల నుంచి మట్టి నమూనాలను సేకరించి తిరుపతిలో భూసార పరీక్ష కేంద్రానికి పంపాలని కోరారు. వ్యవసాయశాఖ అధికారులు వేణుగోపాలరావు, భారతి, సుధా, తొట్టంబేడు, బి.ఎన్.కండ్రిగ మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

110 జీవో అమలుకు ఉప కులపతులకు ఆదేశాలివ్వాలి

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లోని తాత్కాలిక అధ్యాపకులను అసిస్టెంట్ కాంట్రాక్ట్ ప్రొఫెసర్‌గా మారుస్తూ వారి వేతనాలను పెంచే జీవో 111 అమలు చేయాలని గురువారం ఉన్నత విద్యాశాఖ మండల ఛైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డిని తూర్పు అధ్యాపకుల ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డి కోరారు. విజయవాడలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి, ఎగ్జామ్స్ సెట్స్ ప్రత్యేక అధికారి సుధీర్‌రెడ్డి లను ఎమ్మెల్సీ లు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కల్పలత రెడ్డి, రామచంద్రారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల హోదా మార్పు విషయం, అలాగే 110 జీవోను అమలు చేసేలా అన్ని విశ్వవిద్యాలయాల ఉప కులపతులకు అదేశాలివ్వాలని కోరారు. అన్ని విషయాలపై



వారు సానుకూలంగా స్పందించి సమస్యలను త్వరలోనే పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీయూ అకడమిక్ కన్సల్టెంట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కల్లూరు కిషోర్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐ ఎస్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సిపాయి ఫౌండేషన్ సేవలు

ప్రజాశక్తి-రేణిగుంట: రష్ ఆసుపత్రి అధినేత, ఎమ్మెల్సీ, సిపాయి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం సాయంతో పేదలకు గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. అల్లికేశం వైకాపా నాయకులు శివారెడ్డి, విపమాను పట్టెడు సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, సూరప్పకశం సర్పంచ్ సుధారాణి అల్లికేశం గ్రామంలో మహిళలకు పౌష్టికాహారం అందించారు. సిపాయి స్త్రీ అండ, సిపాయి స్త్రీ స్వేచ్ఛ, సిపాయి ఆశీస్సులు అనే కార్యక్రమాలను గ్రామాల్లో నిర్వహిస్తున్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

16న విశ్వంలో పాలిటెక్నిక్ మోడల్ ఎంట్రన్స్ పరీక్ష

ప్రజాశక్తి-క్యాంపస్: స్థానిక వరదరాజనగర్ లోని విశ్వం టాలెంట్ స్కూల్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు విద్యార్థులకు పాలిటెక్నిక్ మోడల్ ఎంట్రన్స్ టెస్ట్ , అవగాహన సదస్సు నిర్వహించబడుతుందని విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి వెల్లడించారు. మే 10వ తేదీన రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు అనుగుణంగా ఈ నమూనా పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. గత ఏడాది పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఫలితాల్లో తమ విద్యార్థిని 118/120 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించిందని తెలియచేశారు. వివరాలకు 86888 88802 / 93999 76999 ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు అని కోరారు.

ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జేసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా అరుణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ కమిషన్ రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా కె.అరుణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గణేష్, రాష్ట్ర కార్యదర్శిగా మంగళం మణి, కొడవలూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా పి.సయ్యద్ మాలిక్ భాషను నియమిస్తూ ఆ సంస్థ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మెహతాబ్ రాయ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు

గురువారం తిరుపతిలోని సుభాష్‌నగర్‌లోని ఎన్‌హెచ్‌ఆర్‌ఎస్‌జేసీ కార్యాలయంలో ఆ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ గౌడ పేరు చిట్టిబాబుకు నియామకపు ఉత్తర్వులను అందించారు. సంస్థ ఆశయాల మేరకు పనిచేయాలని, మానవ హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు.

నూతన కాలనీ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- సోమల: కందూరు గ్రామ సమీపంలో నూతన జగనన్న కాలనీ నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేసేందుకు తహశీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి గురువారం స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జగనన్న కాలనీ కింద సబ్‌స్టేషన్ సమీపంలో కాలనీలో ఇండ్లనిర్మాణాలు జరుగుతున్నాయని అయితే లబ్ధిదారులు ఇంకా అధికశాతం ఉండడంతో వారికోసం మరొకచోట జగనన్న లేఅవుట్ నిర్మాణం చేసేందుకు స్థల పరిశీలన చేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌బాబు, మెకానిక్ బాష, వీఆర్వో, గ్రామసేవకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమ్మె సక్సెస్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : పారిశుద్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని మూడురోజులుగా నగరంలో చెత్త చెదారం తొలగించకుండా సమ్మె నిర్వహించారు. అధికారులకు, కౌన్సిల్‌కు ఎన్నిసార్లు వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో సమ్మెకు ఉపక్రమించారు. దీంతో అధికారులు, పాలకవర్గం స్పందించి పారిశుధ్య కార్మికులతో గురువారంచర్చలు జరిపింది. తిరుపతి నగరపాలక పారిశుధ్య సిబ్బందికి అన్ని విధాలా అండగా వుంటామని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణలు హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించారు. కార్మిక నాయకులు తులసేంద్ర, మదన్‌మోహన్‌రెడ్డి, దొరస్వామి పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీకి ఘనసన్మానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది బదిలీపై అనంతపురం 14వ బెటాలియన్‌కు వెళుత్తున్న చిత్తూరు జిల్లా అడిషనల్ ఎస్పీ, అడ్మిన్ పి.జగదీష్‌ను గురువారం ఘనంగా సత్కరించారు. అధికారులు పోలీస్ గెస్ట్‌హౌస్‌లో గల కాన్ఫరెన్స్ 2017 బ్యాచ్‌కు చెందిన జగదీష్ గతంలో గ్రేహౌండ్స్ కమాండర్‌గా తరువాత పాడేరు సబ్‌డివిజన్‌కు అసిస్టెంట్ ఎస్పీగా పనిచేసి 25 మే 2022న చిత్తూరుకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా భాధ్యతలు చేపట్టారు. బదిలీపై వెళుతున్న పి.జగదీష్‌ని ఎస్పీతో పాటు జిల్లా పోలీస్ హాల్‌లో వీడ్కోలు సభలో పూలమాలలు , శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎస్పీ వై.రిషాంత్ రెడ్డి మాట్లాడుతూ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇన్ని రోజులు చిత్తూరు జిల్లాకి అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌గా విశేష సేవలందించి, జిల్లా శాంతిభద్రతల పరిరక్షణలో పరిపాలనలో తమకు సహాయ సహకారాలు అందించినందుకు హదయపూర్వక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మి, సబ్ డివిజన్ అధికారులు, జిల్లా డిఎస్పీలు, సిఐలు, జిల్లా పోలీసు కార్యాలయం కెఎంవి.మోహన్‌రావు, దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ జయంతి వేడుకలు

తిరుపతి టౌన్ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

సర్వే రాళ్లు నాటే ప్రక్రియను
వేగవంతం చేయండి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఆయా గ్రామాలలో నిర్దేశించుకున్న గడువులోగా సర్వే రాళ్ల నాటే ప్రక్రియను వేగవంతం చేసేలా చూడాలని సి.సి.ఎల్.ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్ లను ఆదేశించారు. గురువారం విజయవాడ సి.సి.ఎల్.ఏ. కార్యాలయం నుండి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వెబ్ ల్యాండ్, సర్వే రాళ్ల నాటే ప్రక్రియ, భూ హక్కు పత్రాల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ, డి.ఆర్.ఓ. శ్రీనివాస రావు, జిల్లా సర్వే అధికారి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.సి.ఎల్.ఏ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ మాట్లాడుతూ.. సర్వేరాళ్ళు నాటే ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. రైతుల భూ విస్తీర్ణంతోపాటు వెబ్ ల్యాండ్ లో నమోదు అయిన భూ విస్తీర్ణమును సరి పోల్చుకోవాలని అన్నారు. వీడియో కన్ఫరెన్స్ అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ సంబందిత అధికారులతో మాట్లాడుతూ.. రీ సర్వే ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొదటి దశ కు సంబంధించి 39,322 సర్వే రాళ్ళు నాటే లక్ష్యంలో భాగంగా 21396 సర్వే నాటే ప్రక్రియను పూర్తయిందని, మిగిలిన పనులను గడువులోపు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. సర్వే రాళ్ల నాటే ప్రక్రియలో భాగంగా ఎక్కువమందితో టీం వర్క్ గా పని చేస్తే రాళ్ల నాటే ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు.